కథ



# మా ఇంటి తంటా

- అరణి

'మా ఇంటి తంటా'కి స్వాగతం! సుస్వాగతం!! మనం ఇప్పుడు కత్తి, రివాల్వర్‌లాంటి మారణాయధాలకు, ప్రతాపాలకు ప్రఖ్యాతి చెందిన వీర బొబ్బిలి గడ్డ మీద... నరసింహరాజు గారి ఇంట్లో ఉన్నాం. నరసింహరాజుగారి భార్య సుగుణగారితో మాట్లాడుతున్నాం.

''నమస్కారం సుగుణగారు''

''నమస్తే''

''గత ఏభై వారాలుగా మీరు, మీకిష్టమైన 'మా ఇంటి తంటా' ప్రోగ్రాం చూస్తున్నారు. అవునా?''

''అవును''

''వారం వారం మా ఇంటి తంటా చూస్తూ... మీరూ ఈ ప్రోగ్రాంలో పాల్గొవాలనుకున్నారు. యామై రైట్''

''రైట్ మేడమ్''

''వారానికో హత్య! వారం వారం రకరకాల హత్యలు మా ఇంటి తంటాలో చూస్తూ మీరూ ఓ హత్య చెయ్యాలని ఉవ్విళ్ళూరుతున్నారు''

''అవును మేడమ్! ఉవ్విళ్ళూరుతున్నాను''

''హత్యలు అనేక రకాలు! కత్తితో చంపొచ్చు! సుత్తితో చంపొచ్చు! రాతితో చంపొచ్చు! రివాల్వర్‌తో చంపొచ్చు...అయితే ఇక్కడ చావడం ప్రధానం కాదు, చంపడం ప్రధానం. ఎలా చంపారన్నదే మా ప్రేక్షకులకు కావాలి.చెప్పండి! మీరెవరని చంపుదామనుకుంటున్నారు? ఎలా చంపుదామనుకుంటున్నారు?''

''మా అత్తగారిని చంపుదామనుకుంటున్నాను మేడం! ఎలా చంపుదామనుకున్నదీ...''

''చంపి చూపిస్తారు! ఓకే! సుగుణగారు వాళ్ళ అత్తగారిని చంపడానికి ముందు మనం తీసుకుందాం...ఓ చిన్న బ్రేక్''

* జలుబు, దగ్గు, జ్వరం...ఇవన్నీ పోవాలంటే ఇకపై మీరు రకరకాల మందులు వాడనవసరం లేదు! ఒకే ఒక చిట్కా ఉంది. అదేంటంటే...బ్లేడుతో గొంతును కోసేసుకోండి! దెబ్బకి అన్నీ ఎగిరిపోతాయి!!

* మీ అత్తగారితో మీరు బాధలు పడలేకపోతున్నారా? మీ ఆడబడుచుతో మీరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? అయితే మీకు కావాలి...మిర్చీ బ్రాండ్ కత్తి! అనువైన సైజుల్లో అందుబాటు ధరల్లో మీకోసం. సంప్రదించండి. మిర్చీ బ్రాండ్ కత్తులు, వన్ డేష్ వన్ టు త్రీ ఆబ్లిక్ సెవెన్, మర్డర్ లేన్, న్యూఢిల్లీ.

''మా ఇంటి తంటాకి తిరిగి స్వాగతం! చెప్పండి సుగుణగారు! మీ అత్తగారిని మీరు ఎలా చంపాలనుకుంటున్నారు? దానికి ముందు మీరీ సంగతి కూడా మా ప్రేక్షకులకు చెప్పాలి. అసలు మీ అత్తగారిని ఎందుకు చంపాలనుకుంటున్నారు? తంటా యేంటి''

''తంటా యేంటంటే...మా అత్తగారిని ఎందుకు చంపాలనుకుంటున్నానంటే...పెళ్ళి అయిన దగ్గర్నుంచీ చూస్తున్నాను. ప్రతి దానికీ సణుగుడే! ఏదీ ఓ పట్టాన ఒప్పుకోదు! కొడుకు-కోడలూ సినిమాకి వెళ్తున్నా సహించలేదు. నేను గుడికి వెళ్ళినా తనకి చెప్పే వెళ్ళాలి. మా వారు నాకు చీర కొని తెచ్చినా తనకి చెప్పే తీసుకు రావాలి. ఏంటిదంతా? ఈ తంటా యేంటి? అసలు ఆవిడెవరు? ఆవిడకు నేను మా వారూ జవాబుదారీ ఎందుకు కావాలి? అందుకే చిరాకెత్తి చంపాలనుకుంటున్నాను''

''నిజం చెప్పాలంటే అత్తలంతా ఇంతేనండి! మీరు మంచి నిర్ణయం తీసుకున్నారు. మరి మీ అత్తగారిని ఎలా చంపాలనుకుంటున్నారు?''

''ఇలా''

''ఇలా అంటూ ఈ బాత్‌టబ్‌ని లాక్కొచ్చారేంటి?''

''ఇందులోనే మా అత్తగారు ఉన్నారు''

''బాత్‌టబ్‌లో అత్తగారా''

''అవును మేడం! బాత్‌టబ్‌లో క్లోరోఫాం నింపి అందులోకి మా అత్తగారిని నిన్న రాత్రే తోసేశాను''

''మంచి పని చేశారు. క్లోరోఫాంలో పడ్డ మీ అత్తగారు స్పృహ తప్పిపోయి ఉంటుంది''

''అవును మేడం! స్పృహ తప్పిపోయింది''

''ఇప్పుడు మీ అత్తగారిని ఏం చెయ్యబోతున్నారు''

''స్పృహ తప్పిన మా అత్తగారిని ఇలా బెంచ్ మీద వెల్లకిలా పడుకోబెట్టి ఈ సుత్తీ మేకూ తీసుకుని...''

''మేకుని మీ అత్తగారి నుదుటి మీద సుత్తితో కొట్టే ముందు మీరో పాట పాడాలి''

''ఏ పాట పాడమంటారు?''

''మీకిష్టమయిన పాట! మా ప్రేక్షకులకు నచ్చే పాట''

''ఓకే! వినండయితే!

నీ పాపం పండెను నేడు
నీ భరతం పడతా చూడు
నీ పాలిటి యముణ్ణి నేను
నీ కరెక్ట్ మొగుణ్ణి నేను''

''పాట చాలా బాగుందండి! ఎవరి దగ్గర నేర్చుకున్నారు''

''మా అమ్మ దగ్గర నేర్చుకున్నాను''

''శృతి-లయ తప్పకుండా అంత కరెక్ట్‌గా పాడారు. మీ అమ్మగారికి సంగీతం బాగా వచ్చా''

''సంగీతం బాగా వచ్చో రాదో నాకు తెలీదు గాని-మా నాన్నమ్మ అంటే మా అమ్మకి చాలా



కోపం. ఆ కోపంలో ఈ పాట పాడుతోంటే...గొంతులో మీరు చెప్పే శృతి-లయలన్నీ ఆటోమేటిగ్గా పలికి ఫీల్ కనిపించేది''

''అదీ సంగతి! సరే! ఇప్పుడు చెప్పండి . మీ అత్తగారి నుదుట మేకుని ఎలా కొట్టబోతున్నారు?''

''ఇలా''

''ఫాట్...బలే ఉంది సౌండు! నుదురు చిట్లిపోయి ఉంటుంది''

''అనుమానమా''

''అబ్బే! లేదు! ఇప్పుడేం చేయబోతున్నారు''

''గుండెల మీద ఈ రాతి బండను ఎత్తేయబోతున్నాను''

''సుమారుగా ఈ బండ నలభై-యాభై కిలోల బరువుంటుంది. ఈ బండ ఎత్తి మీ అత్తగారి గుండెల మీద పడేస్తే...''

''చూడండి! ఏమవుతుందో''

''ధడేళ్! బాగుంది దెబ్బ! దెబ్బకి గుండె ఆగిపోయి ఉంటుంది''

''అనుమానమా''

''లేదు! కాకపోతే తర్వాత మీ అత్తగారిని మీరు మళ్ళీ ఏదో చేసే ముందు మనం తీసుకుందాం...ఓ చిన్న బ్రేక్''

* నాకు దాని పర్సు కావాలి

అది చచ్చినా నీకివ్వదు! కావాలంటే తన మొగుణ్ణి నీకు ఇస్తుందేమో కాని, పర్సా?! చచ్చినా ఇవ్వదు''

ఎందుకివ్వదో నేనూ చూస్తాను

ఇవ్వదుగాక ఇవ్వదు! అది పర్సే! డబ్బున్న పర్సు! కావాలంటే కన్నబిడ్డను ఇమ్మన్నా ఇస్తుందేమోగాని పర్సు చచ్చినా ఇవ్వదు

దాని దగ్గర్నుంచి ఆ పర్సు ఎలా తీసుకోవాలో నాకు బాగా తెలుసు! అందుకు నేనేం చేస్తానో చూడు!!

పర్సు-మనసు
మెగా డైలీ సీరియల్ .
సోమవారం నుంచి శుక్రవారం వరకు. మీ టీవీ టెన్‌లో!!

* ఆదివారం, అమావాస్య, అర్ధరాత్రి మీరీ జపం చెయ్యాలి

మంత్రం చెప్పండి! చేస్తాను!

ఓం ముమైత్ ఖాన్ నమః! ఓం సిల్క్‌స్మితాయ నమః

ఓం జ్యోతి లక్ష్మాయనమః! ఓం జయమాలినే నమః

-ఈ మంత్రాన్ని కోటి సార్లు జపిస్తే నువ్వు కోరుకున్న కన్య నీ సొంతం అవుతుంది. మంత్రాన్ని స్పష్టంగా పలకాలి! పలకలేదనుకో! రక్తాన్ని కక్కుకుని చచ్చిపోతావ్

అర్ధరాత్రి అందగత్తెలు
గొప్ప హారర్ సీరియల్
ప్రతి శనివారం-ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు. మీ టీవీ టెన్‌లో.

''మా ఇంటి తంటాకి తిరిగి స్వాగతం! మేకుతో మీ అత్తగారి నుదురు పగలగొట్టారు. రాతి బండతో మీ అత్తగారు గుండె పగలగొట్టారు. ఇప్పుడేం చేయబోతున్నారు''

''ఈ కర్రతో కాళ్ళు చేతులూ విరగ్గొడతాను''

''ఏదీ! ఎలా విరగ్గొడతారో చూపించండి''

ఫట్! ఫెడేళ్! ఫెడేళ్! ఫట్!

''కాళ్ళూ చేతులూ పచ్చడి అయిపోయాయి''

''అనుమానమా''

''అబ్బే లేదు! మొత్తానికి మీ అత్తగారిని మీరు ఆనందంగా చంపేశారు''

''చచ్చిందో లేదో దాని ముక్కు కింద వేలు పెట్టి మీరే చూడండి''

''వావ్! చచ్చింది! మీ ఇంటి తంటా తీరిపోయింది! శుభం. ఇప్పుడు మనం ఇంట్లో తంటాలు రేపే అత్తగారిని చంపడానికి కావాల్సిన పరికరాలు గురించి తెలుసుకుందాం! ఓ చంపదగిన అత్తగారు, ఓ బాత్‌టబ్ క్లోరోఫాం, ఒక సుత్తి, ఒక మేకు, నలభై ఏభై కిలోల రాతిబండ, తర్వాత బలమైన కర్ర! కావాల్సిన పరికరాలు తెలుసుకున్నారు కదండి! ఇక ఇవాళ్టికి శలవు! మళ్ళీ రేపు ఉదయం సరిగ్గా పన్నెండు గంటలకు 'మా ఇంటి తంటా'లో మరో హత్య గురించి తెలుసుకుందాం. అంటిల్ దెన్...బై!!

*